# కిట్టమ్మగారి పెద్దజీతగాడు

ఈ ఏటి పంటకుప్పలు దొబు దొబ్బున నూర్చెయ్యాలి. అదే కిష్టమ్మగారన్నాడు. మడిసి అన్నాడంటే నూర్చెయాల్సిందే! లేకపోతే ఒసికఱ్ఱ దీసుకు తల పగల్నాకుతాడు– అట్టాటి మడిసే కిష్టమ్మగారు. సెయి బహు సురుకు యీ కిష్టమ్మగార్ది. మడిసికి ఏ నిమిసాన గుబులుమల్లుద్దో, ఎప్పుడు ఈపు మీన సెయిపడుద్దో తెలవదుగదా! కాత్తె పెద్దజీతగాణ్ణిగందా– అప్పుడప్పుడు మడిసిని నమ్మగూడదా అనిపిచ్చుద్ది. పెల్లి జేసుకున్నా – పెల్లాం కాపరాని కొచ్చిందీ– అయినా మడిసిని కనిపెట్టి చూద్దేం యీ కిష్టమ్మ దొంగల్దోలా! అల్లప్పుడు పుటిక్కిన నోరు జారన్నా సుబ్బాంతో "కిష్టమ్మగారు పొలుపు దీసుకుని బాదా''దని ఇరగబడి నవ్వింది. నద్దీ యిరగదన్నాల్చిందప్పుడే. ఉత్తకొక్కిరాయిముండ! అయినా కొత్తగా పెల్లి జేసుకున్నోణ్ణి పెల్లాంతో యిట్టాటియ్యన్నీ అసలెవురన్నా సెప్పుకుంటారా అంట! అసలు వుత్త ఎదవనుగానూ నేనూ! ఇట్టా వొచ్చుద్దనే, ఆ మద్దె తొలేకాసినాడు, కిష్టమ్మకు గుబుల్దిరిగి, ఒసికఱ్ఱ దీసుకుని తల పగల్నాకుతే, కిక్కురుమనకుండా ఎల్లి వాములదొడ్డో పండుకున్నా. పోనీ పని మానుకుందామా అంటే మాటలా? ఆనాడు గురవయ్యోళ్లు యేమన్నారూ? "నీకు ఏనాడో సుడివుండదిలేరా, కిష్టమ్మగారి పెద్దజీతగాడివయినావు!" అన్నారు. ఆళ్ళకేం తెల్సుద్ది అస్సల్సంగతి? అయినా యింకోసోట యాడన్నా కాత్తె సుమారయిన పని దొరకాలగందా? ఏడా? యీ సన్నాసూర్లోనేనా మడుసులు కాత్తె సుమారుగా బతికేదీ? ఎదవ మొగాలుగాదూ ఈడంతా! అంతా దివాలా ఎత్తారుగందా, కేసులు బోనుల్తో తలకాయలు పగల్నాక్కునీ! అందుకే దీన్ని బొంబోడూరంటారు. ఎవరో ఒకరిద్దరు కిష్టమ్మగారింటి వారయితే అట్టట్ట మద్దెన బాగుపడ్డారు గాని– మిగతాదంతా వుత్త శత్త గాదూ? పొలం అంటే కిష్టమ్మగారి పొలం అనాల ఎప్పటికయినా! రతనాలు కక్కుతయ్యంటే ఇంకా ఆడ సచ్చేంవుంటదీ? ఈ సేతుల్తో యిన్నేళ్ళ మించి ఎట్టాటి కుప్పల్నూర్చాను? హిఁ, కోటయకొండ పెబల్లాంటి కుప్పలు! "ఒలియ ఒలియో" అంటా తొలికోడి కూసినప్పట్నుంచీ కొట్టుకుంటా పోయిన పోటం– జల్జలా జల్జలా రాసుల్రాసులు అంతరిచ్చానికి లెగిసి పోతా వుండాల్సిందే– కిష్టమ్మగారు అవకాడ నిలబడి ఇదంతా చూస్తా నవుతా వుంటాడు. నాకే గనక అట్టాటి కుప్పలుంటేనా! సుబ్బాన్ని సికరంమీన కూకోబెడ్తా! నవ్వుద్ది సుబ్బాం! ఆ గింజనంతా మీనబోసుకుంటాం

తరంబరాలకుమల్లే! కుప్పగొట్టే ఎంకాయ్, యీరాయ్, పోలాయ్, పెంటాయ్, దిబ్బాయ్, గుంటాయ్, మట్టాయ్, చుక్కాయ్, పుల్లాం, పోలాం, ఎర్రాం, ఎంకాం యీళ్ళందరికీ బత్తాలకి బత్తాలు-"

"సూరాయ్" అన్నది కిష్టమ్మ గొంతు.

"ఏంది కిష్టమ్మగారూ-" దున్నకుర్రకు గాబుకాడ నీలు పెడ్తా సుట్ట మైకంలో కూకునుండ పెద్దజీతగాడు - కండబల్సిన కోడెదూడ కుమ్మిన కుమ్మటం అట్ట ట ట ట లెగిసిపోయినట్టు - పట్టివేసి నిలబడ్డాడు సూరాయ్, కిష్టమ్మనీడ అట్టగుపించే తలికి.

"సుట్ట గీటుమీనుండదేరా సూరాయ్?"

"అబ్బె యాడ్డండీ - వుత్త శత్త పుగాకయితే!"

"చా యదవా పొళ్లు రాన్నూ కే వోళ్లులేకా! దున్నకుర్రకు అంతసేపట్రా నీలుతాపేదీ!"

"సప్పరిచ్చుకుంటా తాగుద్దండీ-"

"ఇగ ఆడకి సాల్లేవోయ్ ముండా"

"అంతే లెండి."

"ఇదుగో సూరాయ్!"

"ఏంది కిష్టమ్మగారూ?"

"ఈ ఏడు మన పంట ఎట్టా పండిందనుకుంటున్నార్రా?"

"ఇరగబడి పండిందంటున్నారండీ?"

"నిజంగానంట్రా!"

"నిజంగా! వూరంతా యిదేమాటయితే!"

"బలేపంట పండిందంటావ్?"

"బలేగిలే ఎరగమే!"

"సూరాయ్!"

"ఏంది కిష్టమ్మగారూ?"

"కొత్తకోడెగిత్త లొస్తున్నయి తెలుసునంట్రా?"

"యాడ? - ఎవురికీ-!"

"మనకేరా యెదవా!"

"ఏందీ- నిజంగానంటండీ- చా-! అరె- ఆఁ హి హి-హి సెప్పలేదేంటండి కిష్టమ్మ గారూ?"

"మొన్న ఏటవతలకు ఎల్లినప్పుడు బేరం జేసొచ్చాలే. యీ పాటికి రెడ్డమ్మ తోలుకొస్తావుండాలి."

"చా!"

"చా ఏందిరా ముండా. బల్ మనగాడి గిత్తలయితే!"

"ఆఁ- యిహి-"

"ఈఏడు కుప్పల్నూర్పిడంతా మన కొత్తగిత్తల మీనగా పోవాల్సిందే!"

"దుమ్ము ల్లేపనండీ!"

"పదిహేనొంద లిచ్చికొన్నా!"

"కిష్టమ్మగారు తల్చుకుంటే పదే నొందలొక లెక్కేందంటా!"

"మంచి ఏపు మీనుండయిలే!"

"యింకా ఏపుమీన మేపుతా!"

"సూరాయ్!"

"ఏంది కిష్టమ్మగారూ?"

"రేపు తొలికోడి కూసే యాలకు నూర్పిడి మొదలు పెట్టాల-చెప్పానుగా?"

"మరి అంతేగదండీ."

"మాలపల్లిలో అందర్నీ కేకేశావంట్రా?"

"ఎప్పుడో అయిపోతే."

"గొబ్బిరికాయలు తెచ్చావంట్రా."

"అప్పుడే తెత్తిని గదంటండీ."

"రాత్రికి యింకోసారి ఎల్లి వాళ్ళందర్నీ రెడీ గుండమను."

"ఎల్లను మరీ!"

"నువు పెందలకాడ లెగవకపోయినావంటే మెడిరగ నూకుతా-తెల్సిందా?"

"మొదలు నాకు నిదరేడ పట్టుద్దండీ!"

"కోడెగిత్త లొస్తావుంటయి. గాబులో కుడితి గలిపి రెడీగుండు - ఆఁ?"

"క్లె! కోడిగిత్తలు తల్మండమొయ!" అనుకున్నాడు సూరాయ్.

"పంటకుప్పలు! కోటయకొండ పెబలకుల్లే - ఎంకాయ్, యీరాయ్, పెంటాయ్, పోలాయ్, మట్టాయ్, చక్కాయ్, దిబ్బాయ్, పుల్లాం, పోలాం, ఎంకాం, ఎర్రాం - లెగిసిపోవాల్సిందే - నూర్పిడి తల్మొండమొయ..."

* * *

నిశిరేత్రే లెగిసి కూకుండాడు తను. నయం! యింకానా తను పండుకునేదీ! పంటకుప్పలు నూర్చుకోనక్కర్లా? తొలికోడి ఎప్పుడుకూసినా కూసుద్ది...

పంట యిరగపడి పండింది! పంటకుప్పల్ని సూత్తుంటే ఒల్లు యాడికో లెగిసిపోతుందది! ముంగలగా ఎల్లి తను ఒక్కో పంటకుప్ప సికరమ్మీన కూకోవాలి - సుబ్బాం అంత దొబ్బున ఎక్కలేదు - ఆఁ, దాన్ని నమ్మిందెవురు - తల్సుకుంటే ఎంత పనయినా సేసుద్ది. పిర్రలెగరేసుకుంటా. బల్ ముద్దొచ్చుద్ది ఎదవముండ! నూర్పిడి అవుతావుంటే సూడాలి ఎదవను - యియ్యాల ఒడ్లగింజ నంతా దాన్నెత్తినే పోశాననుకో - యిద్దరం పోసుకుంటాం.

అరె నాయనా ఎట్టాటి కోడెగిత్తలు! సూరాయ్ కోడెగిత్తలు! గిత్తలమీన కిష్టమ్మ సెయివేశాడంటే ఒసికర్రతో తల ఏటుకు పగిలిందన్నమాటే! ఇంకా నెమరేత్తా పండుకున్నా రేందే లెగవండి లెగవండి ఏలయిపోతుందది-దూరపయానం జేశారుగావాల్ను కూసేపు జనపకట్టల్ని తినండి - యియ్యన్నీ తినండి. ఎందుకే అట్టజూత్తారూ? సూరాయంటే వాడు వీడనుకుండారో ఏమో, మీమీన యీగవాలిందంటే యీ సూరాయి పానం ఆవజాన అడ్డంగా పడిపోవాల్సిందేననుకోండి - గెనగెన గంటలు, గెజ్జెలు, మువ్వలు, కుచ్చులు, గులాం కొట్టుకుంటా - దుమ్ము లైగుపుతా పోవాలి. యాడకి పోయినా - తల్మొండమొయ సూరాయిగిత్తలు - యీ సుబ్బాం యింకా పండుకుందేం యాల మిగిలిపోతుంటే -

"సుబ్బాం?"

"సాల్లే వూర్కో-"

"లెగవ్వే నా సిలకా-"

"అదేందమ్మా కోక గుంజుతాడూ - నా చంగతెరగవు-నిదరొత్తాఉందది-"

"నిదర? యిదేం సుబ్బాంరా యిదీ-గెంటలు గెనగెన మోగిపోతావుంటే, లెగులెగూ-"

"అబ్బబ్బబ్బబ్బ యిదేం మొగుడ్రో నాయినా - నాసెవులో మోగియ్యమాక - బుడ్డపుంజుకుమల్లే - అబ్బోవ్ - ఎహ లెగూ నిశిరేత్రి యిదేందంటా - మాయదారి సచ్చినోడా-"

'అరహరా! ఒలియ ఒలియో – ఇదిగో సుబ్బామోవ్, ఎఱ్ఱకోక, నల్ల రెయిక కట్టుకు రావాల్సిందే యియ్యాల – ఓరి ఎంకాయ్, యీరాయ్, పోలాయ్, పెంటాయ్, మట్టాయ్, చక్కాయ్, దిబ్బాయ్, గుంటాయ్ – వాసి పుల్లాం, పోలాం, ఎఱ్ఱాం, ఎంకాం యాడవుండార్రా మీ మడుసులు బంగారంగానూ – లెగవండ్రా, లెగవండ్రా తెల్లారిపోతుండదీ – సుబ్బాం గొబ్బిరికాయలెత్తుకురా – ఎఱ్ఱకోక, ఎఱ్ఱకోక – పదండి పదండి, లెగవండి లెగవండి – సూరాయ్ కోడెగిత్తలు – ఎల్లిపోతుండయి మేగాల్మీన–

"ఎందుకే సుబ్బాం సిగ్గుపడ్తుండావ్?"

"బలేబండి – బలేగిత్తలు!"

"సూరాయ్ బండి, సూరాయ్ గిత్తలు–

"ఒరి ఒరి బండీవోడా, ఒగలమారి బండివోడా' – ఓహెయ్–"

"బండిమీనా నాసోకూ నిలపరా బండీవోడా – ఏహేయ్–"

"ఒహో సిత్రరేఖా?"

"ఏమి అనిరుద్ధడా?"

"ఎహే అనిరుద్ధడవు–"

"ఏం సచ్చాడో యదవ – ఒగలమారి బండీవోడా!"

"బండిమీనా నీ సొగసూ – ఓగి రండిరా, రండిరా మూర్తం మిగిలి పోతూండదీ – గొబ్బిరికాయలు కొట్టవేందే సుబ్బాం–"

"క్లె! రతనాలకిమల్లే రాల్తుండయి గింజలు! సూరాయ్, సుబ్బాం, ఎంకాం, యీరాయ్, పోలాయ్, పెంటాయ్, మట్టాయ్, చెక్కాయ్, దిబ్బాయ్, గుంటాయ్, పుల్లాం, పోలాం, ఎఱ్ఱాం, ఎంకాం – యీళ్ళందరి సేతుల్లోంచి గింజలు – తళతళ, బగబగ మెరుత్తా రాల్తుండయి – అందరి మొగాలు మెరుత్తుండయి – ఎంకాయోళ్ళ ఒళ్ళు సెమటలు కారిపోతుండయి – ఎఱ్ఱాయోళ్ళ కళ్ళు రఖతం గక్కుతుండయి – ఒలియ ఒలియో–

"సుబ్బాం, నీ కళ్ళు నీలుగార్తుండయ్యేందే!"

"నీ మొగం ఎఱ్ఱగా వుండదేరా!"

"దువ్వ లెగిసిపోతుండది – కుప్పలు కరిగిపోతుండయి – తొక్కండి, తొక్కండి కళ్ళాం, ఎయ్యండి, ఎయ్యండి కళ్లాం – సుబ్బాం, తూర్పార, తూర్పారపట్టు, పట్టు – తరంబరాలు–"

"ఓహేయ్!"

"ఏహేయ్!"

"ఆర్నాయినా జిలేబి సెంచయ్య ఒచ్చాడ్రా నాయనా - ఓతాళాసెవుల గుత్తి సెంచయ్యోవ్ - జలేబి, సెక్కిరాలు, పకోడీలు, పొప్పుండలు, ముంతకజ్జాయం-ఓర్నీ రావయ్యా నీ యిల్లు బంగారంగానూ, వారె గోతాం దెచ్చాడ్రా యీ సెంచయ్య కడుపాత్రంపాడుగానూ- ముంగల కాత్తె జిలేబీ పెట్టు. ఆనక సూద్దాం గోతాం సంగతి- ఏందదీ- ఏంది సన్నాయికఱ్ఱ యినిపిచ్చుద్దేఁ- గంగిరెద్దోళ్ళు ఒచ్చార్రా నాయనా- పెలిజేత్తారుగావాల్ను - ఎహె పదండాతలికి సెవులో వూత్తారూ- ఎహెఎహె, యిదేంది గంగిరెద్దు వఫ్లకుప్పెక్కుద్దీ- ఓ గంగిరెద్దాయనోవ్, కాత్తె దాన్ని నిలపవయ్యా సికరమ్మీన కెల్లి కూకుంటదేమో - వుండండి, కాత్తె వుండండి- వూదమాక అదుగో ఆడ నిలబడి ఆడండి గంగిరెద్దాట- ఇదుగో సీతారాములోరి పెల్లి - పెల్లి ఆడిచ్చాల తెల్సిందా?"

ఏనాది సెంచాం కూతురు బుడ్డది ఒడిగట్టుకొచ్చి మొగమాటంగా నిలబడ్డది- సుబ్బాం సేటతో శారెడు గింజలు బుడ్డదానొళ్ళో పోసింది-

"సుబ్బాం" అన్నాడు తను ఎఱ్ఱకోక సుబ్బాన్ని వఫ్లరాసి సికరంమీనకు లాగుతా.

"ఏందయ్యా?" అంటున్నది సుబ్బాం సిగ్గుతో తలొంచుకుంటా.

ఎఱ్ఱగా నల్లగా మెరిసిపోతుండది సుబ్బాం- పెద్దకాలవగట్టున సూరుడు ఎఱ్ఱబడిపోతుండాడు రఖతానికమల్లే- అదేంది!- ఎంకాయ్ యీరాయ్-పోలాయ్-పెంటాయ్-మట్టాయ్, చక్కాయ్, దిబ్బాయ్, గుంటాయ్, పుల్లాం, పోలాం, ఎఱ్ఱాం, ఎంకాం రాసి సుట్టూతాజేరి ఎగుర్తుండారు- ఓహేయ్-

"ఓరి సూరాయోవ్-"

మంచంమ్మీన్నుంచి ఎగ్గిరి కిందపడ్డాడు పెద్దజీతగాడు సూరాయ్... అది కిష్టమ్మ గొంతు.

"యియ్యాల కుప్పలు కొట్టక్కర్లేదంట్రా సూరాయ్? యింకా లెగిచావా లేదురా. తన్నంఁడ్రా నిదరమొగం నాయాల్నీ- ఎల్లి ఎంకాయ్, యీరాయోళ్లను కేకేసిరావేం?" దబదబ దబదబ కిష్టమ్మ గొంతూ, సెయ్యీ సూరాయ్ గుడిసె మీన గుండెమీన మోగిపోయినై దద్దరిల్లగొడ్తా....